క్లుప్తంగా

నేడు మాసమ్మ గంధమహోత్సవం

పెద్దమండ్యం : పెద్దమండ్యంలో కుషావతీ నది ఒడ్డున వెలసిన మాసమ్మ తల్లి గంధ మహోత్సవం గురువారం నిర్వాహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి గంధం, శుక్రవారం రాత్రి ఉరుసు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గంధం మహోత్సవం కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హిసేనీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కలిచెర్ల సింగిల్ వీండో చైర్మన్ సుధాహరరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఉరుసు సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపారు. గ్రామసర్పంచ్ సోదనపల్లె బాషా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

కలకడ : మండలంలోని దేవులపల్లెలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవికి, బాలయ్యగారిపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లె గ్రామదేవత కొత్తపురమ్మకు ప్రత్యేక పూజలు చేసి, చాందినబండ్లు కట్టి ప్రదక్షణలు చేశారు. మంగళవారం రాత్రి దేవులపల్లెలో శ్రీచౌడేశ్వరిదేవిని సింహవాహనంపై గ్రామ పురవీధులలో జ్యోతులు, అమ్మవారిని ఊరేగించారు. ఇంటింట పూజలు నిర్వహించారు. అలాగే బాలయ్యగారిపల్లె పంచాయతీ, నల్లగుట్టపల్లె గ్రామదేవత కొత్తపురమ్మకు చాందినీబండ్లు కట్టి, ఏటా బోనం సమర్పించి భక్తులు వారి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా అధికసంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారి సేవలో తరించారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్ని నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ఎస్.ఆర్ చంద్రశేఖర్ రూ.25,116 విరాళంగా అందజేశారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దాతలు చంద్రశేఖర్ దంపతులు విరాళ మొత్తాన్ని ఈఓ మంజులకు అందజేశారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

తెట్టు ఆలయ హుండీ ఆదాయం రూ.1.14 లక్షలు

కురబలకోట : మండలంలోని తెట్టు శ్రీ వేణు గోపాలస్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 1,14,600 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మునిరాజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. డిసెంబరు 23 నుంచి మే 24 వరకు హుండీ ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

భగవద్గీత పఠనంతో విజ్ఞానం

కేవీపల్లె : భగవద్గీత పఠనంతో విజ్ఞానం పొందవచ్చునని త్రైత సిదాంతం, ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డివారిపల్లె, గ్యారంపల్లె, వంకవారవడ్డిపల్లె, దూదేకుల పల్లె, గోరంట్లపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. భగవద్గీతలని పురుషోత్తమ ప్రాప్తి యాగం అధ్యయం నందు 16, 17వ శ్లోకాల గూర్చి అవగాహన కల్పించారు.

బుద్ధ జయంత్సుత్సవాలు జయప్రదం చేయండి

పీలేరు : ఈ నెల 31న మదనపల్లెలోని బుద్ధుని కొండపై నిర్వహించనున్న బుద్ధుని జయంతోత్సవం జయప్రదం చేయాలని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు కోరారు. బుధవారం స్థానిక బాస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలకు బెంగళూరులోని మహాబోధి సొసైటీకి చెందిన బౌద్ధ బిక్షువులు హాజరై బుద్ధ పూజ, ధర్మ ప్రవచనం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా బుద్ధిష్టులు హాజరవుతున్నట్లు తెలిపారు.

'గోరుముద్ద'ను సక్రమంగా నిర్వహించాలి

గుర్రంకొండ : ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తున్న గోరుముద్ద కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని కార్యక్రమ మాస్టర్ ట్రైనర్ నాగమ్మ, ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో గోరుముద్ద కార్యక్రమంలో ప్రభుత్వ నిర్దేశించిన ప్రణాళిక మేరకు విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

పీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని యర్రగుంట్లపల్లె, గూడరేవుపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. రైతులకు అనువుగా ఫారంపాండ్లు, బౌండరీలు, కందకాలు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జాబ్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరూ తమకు తగిన పనులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ


అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు

- విశ్వరూప దర్శనంతో భక్తులకు దర్శనం
- పోటెత్తిన భక్తులు

మదనపల్లె సిటీ : కోరిన కోర్కెలు తీర్చే కోర్టులో గంగమ్మ జాతర బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కోర్టు ఆవరణంలో కుమ్మర సిద్దప్ప వంవస్థులు తయారు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకుని ప్రతిష్ఠించారు. మొదట రాటకొండ కుటుంబీకులు కల్లుకుండకు తీసుకువచ్చి పూజలు చేశారు. వంశ పారంపర్యంగా వస్తున్న అనవాయితీ ప్రకారం మొదటి పూజ జోశిపాలెం వంశస్తులు నిర్వహించి అమ్మవారికి సారెను సమర్పించారు.అమ్మవారి విశ్వరూప దర్శనం కనుల పండువగా జరిగింది. అమ్మవారి ఆలయంలో విశ్వరూప దర్శనం ఏర్పాటు చేశారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే జరిగే విశ్వరూప దర్శనాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పట్టణ వీధులు, ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఎగబడి దర్శించుకున్నారు. పొంగళ్లు, పిండి వంటలను తయారు చేసిన దీపాలతో అమ్మవారికి చెల్లించారు. అమ్మవారికి కిరీటంతో పాటు బంగారు ఆభరణలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం సాధారణ క్యూలతో పాటు, రెండు వీఐపీ క్యూలు ఏర్పాటు చేయగా, ఆలయ ప్రాంగణంలో భక్తులు కోళ్లు, అమ్మవారికి వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు,సారె చెల్లించి అమ్మవారికి దర్శించుకున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విశ్వరూపదర్శనం కనుల పండువగా జరిగింది. జాతర పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని వివిధ రంగుల పూలతో అందంగా తీర్చిదిద్దారు. స్థానిక అమినేనివీధి, రాటకొండ వీధుల్లోని అమ్మవారి ఆలయాల్లో గంగమ్మలకు పూజలు నిర్వహించారు. భక్తులకు ఏపీఎస్‌యుఎఫ్ నీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మార్పురి చిన్నరెడ్డప్ప, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, గౌరవ అధ్యక్షులు భవానీప్రసాద్, కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, మార్పురి మహేష్, దేవేంద్ర తదితరులు జాతరను పర్యవేక్షించారు. వన్‌టౌన్ సీఐ వల్లిబసు,ఎస్.ఐ హరిహరప్రసాద్ బందోబస్తును పర్యవేక్షించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


గంగమ్మ జాతరలో నిసార్ అహ్మద్


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

రామసముద్రం : ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ వేడుకున్నారు. బుధవారం ఆయన మండలంలోని ఆర్. నడింపల్లె పంచాయతీలోని శ్రీ రాములపల్లె, ఎరబ్రోయిన పల్లె గ్రామాల్లో గంగ జాతరకు హాజరయ్యారు. గ్రామస్తులు నిసార్ అహ్మద్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనపై, ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. అలాగే జడ్పీటీసీ రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ వెలువడే ఎన్నికల ఫలితాలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు కేశవరెడ్డి, నాయకులు భాస్కర్ గౌడ్, రఘునాథరెడ్డి, జయరామిరెడ్డి పాలబత్తుల సుబ్రహ్మణ్యం, సిహెచ్ ప్రకాష్, దర్శన్ రెడ్డి, రమణారెడ్డి, తిప్పరాజు, వెంకటప్ప, కష్ణమూర్తి, మంజునాథ్, ప్రశాంత్, బుడ్డారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఫ్లాగ్‌మార్చ్


పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ యువరాజు తదితరులు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సందర్భంగా పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు మదనపల్లె సబ్‌డివిజన్ పోలీస్ ఆఫీసర్ జి.ప్రసాదరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు జూన్ 4న ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని, పట్టణంలో ప్రశాంత వాతావరణమే లక్ష్యంగా బుధవారం మదనపల్లె సబ్‌డివిజన్‌లోని పోలీస్ అధికారులు, బీఎస్‌ఎఫ్ కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని చిత్తూరుబస్టాండ్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ నెహ్రూబజార్, అప్పారావుతోట, బెంగళూరుబస్టాండ్, మల్లికార్జున సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, కదిరిరోడ్డు మాయాబజార్, చౌడేశ్వరిదేవీ ఆలయం వరకు సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ కారణంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళి అనుసరించి ప్రతి ఒక్కరూ నడచుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించిన కఠినచర్యలు తప్పవన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత విజయోత్సవ ర్యాలీలకు, టపాకాయ పేలుళ్లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున నలుగురు వ్యక్తులు ఒకచోట గుమికూడినా, అల్లర్లకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. పట్టణ ప్రశాంతతను కాపాడేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ యువరాజు, నాగేంద్ర, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్‌ఐ ఇమామ్‌సాహెబ్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు


మాట్లాడుతున్న స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు

పీలేరు రూరల్ : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాజకీయ పార్టీ నాయకులకు, కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4న రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మూడంచెల భద్రత నడుమ పోలీస్ నిఘా నీడలో కౌంటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల తప్ప ఎవరినీ లోనికి అనుమతించబోమని హెచ్చరించారు. 4వ తేదీ ఫలితాలు వెలువడునున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్, సీఆర్, పీసీ, 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇప్పటి వరకు పీలేరుపై నిఘా విభాగం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ రమాచంద్ర, సీఐలు మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, మోహన్, పులి శేఖర్, ఎస్‌ఐ నరసింహుడు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభయాత్ర


శోభయాత్రలో హనుమంతుడి విగ్రహం ఊరేగింపు

మదనపల్లె సిటీ : హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలో హనుమాన్ శోభయాత్ర వైభవంగా జరిగింది. స్థానిక సొసైటీకాలనీ నుంచి హనుమంతుని విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి ర్యాలీ ప్రారంభించారు. జై శ్రీరామ్... జైజై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ చైతన్య వేదిక సభ్యులు బైక్‌లలో ర్యాలీ నిర్వహించారు. సొసైటీకాలనీ నుంచి ఎస్టీఆర్ సర్కిల్, సీటీఎం రోడ్డు, చిత్తూరు బస్టాండు,,నీరుగట్టువారిపల్లె వరకు ర్యాలీ సాగింది. మహిళలు స్వామికి మహిళలు పూజలు చేసి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో చైతన్య వేదిక అధ్యక్షులు వెంగళరావు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు, బీజేపీ పార్లమెంటరీ అధ్యక్షులు సాయిలోకేష్, బండి ఆనంద్, జర్మనీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక


మాట్లాడుతున్న ఎంపీపీ పూర్ణచంద్రిక

పెద్దమండ్యం : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయశాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. గృహ అవసరాలకు, వ్యవసాయానికి వేరువేరుగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఏఈ శంకర్‌రెడ్డి తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. దీంతో పల్లెల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా 24 గంటలు ఉంటుందని తెలిపారు. వారానికి ఒకసారి బిసిజి వ్యాక్సిన్‌ను వయోజనులకు వేస్తున్నట్లు డాక్టర్ ఇమ్మాన్యుల్ తెలిపారు. ఈ వ్యాక్సిన్‌ను 600 మంది వయోజనులకు ఇప్పటికే టీకాను వేసినట్లు చెప్పారు. వాటర్‌షెడ్ ద్వారా 25 మంది రైతులకు పివిసీ పైపులు, టార్పాలిన్ పట్టలు, స్ప్రేయర్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు పీవో రవీంద్రబాబు తెలిపారు. త్వరలో రైతులకు వీటిని అందిస్తామని చెప్పారు. ఖరీఫ్‌లో రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలను రిజిస్ట్రేషన్ పూర్తి పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాదిహామీ ద్వారా కూలీలకు విరివిగా పనులు కల్పిస్తున్నట్లు ఏపీవో తెలిపారు. కొత్తగా జాబ్ కార్డులు అర్హత ఉన్నవారికి పంపిణీ చేస్తామని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, చేయూత ద్వారా మహిళల ఖాతాలకు ప్రభుత్వం జమచేసినట్లు ఏపీఎం తెలిపారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఈవో పీఆర్‌డి శ్రీధర్‌రావు, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, సోదనపల్లె బాషా, కంటి విశ్వనాధరెడ్డి, పద్మావతమ్మ, ఎంపీటీసీ సభ్యులు మంచూరి జయరాం, బోడిమాని గీత, రవితేజ, నరసమ్మ, లక్ష్మీదేవి, కోఆప్షన్‌మెంబర్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటకు చేరిన రోడ్డు వివాదం

- గోడ కూల్చారని గ్రామస్తులపై ఫిర్యాదు
- రెవెన్యూ సిబ్బందికి గ్రామస్తుల వినతి


వినతిపత్రం ఇస్తున్న కొత్తపల్లె గ్రామస్తులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ కొత్తపల్లెకు వెళ్లే మట్టిదారిని ఆక్రమించి సిమెంటు పలకలతో గోడను నిర్మించి రాకపోకలకు అడ్డు కల్పించారని గ్రామస్తులు మంగళవారం రాత్రి ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఈ వ్యవహారం బి.కొత్తకోటకు చేరింది. కొత్తపల్లె గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్ చేరుకుని రహదారి సమస్యపై సీఐ సుర్యనారాయణకు నివేదించారు. తరతరాలుగా ఉన్న రహదారిని ఆక్రమించి ప్రహరీ నిర్మించడం వల్ల ఇబ్బందులు పడతామని గ్రామస్తులు సీఐకి వివరించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సీఐ గ్రామస్తులకు సూచించడంతో వారు తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. తహసీల్దార్ ఎన్నికల విధుల్లో ఉండటంతో గ్రామస్తులు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. రహదారిని ఆక్రమించి ప్రహరీ నిర్మించారని, దీన్ని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రెవెన్యూ సిబ్బంది చెప్పారు. కాగా మంగళవారం రాత్రి కొత్తపల్లెలో జరిగిన ఘటనపై నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ స్థలంలో సిమెంటు పలకలతో ప్రహరీ ఏర్పాటు చేసుకుంటే గ్రామస్తులు వాటిని తొలగించారని పేర్కొంటూ ఫిర్యాదు చేసింది.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న అధికారులు

ములకలచెరువు : మండలంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలించినా, డంప్ చేసినా చర్యలు తప్పవని ఎస్‌ఈబీ సీఐ రామమోహన్, ఎంపీడీఓ పోలప్ప, ఎస్‌ఐ తిప్పేస్వామి అన్నారు. మండలంలోని దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లె సమీపంలోని పెద్దేరు వంక నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు, చుట్టు పక్కల ఇసుక డంప్‌లు ఏర్పాటు చేశారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మదనపల్లె మైనింగ్ సిబ్బందితో అధికారులు బుధవారం దేవులచెరువుకు చేరుకున్నారు. వంకకు చుట్టుపక్కల డంప్ చేసిన సుమారు 100 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో తదతరి చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

దివ్యాంగుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

కలకడ : దివాగుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, తల్లిదండ్రులు దివ్యాగులను ప్రోత్సహించి ప్రత్యేక పాఠశాలలో నమోదు చేసుకోవాలని మండలవిద్యాశాఖ అధికారి రామచంద్రా రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కలకడ, కె.బాటవారిపల్లె పంచాయతీలలోని ప్రతి ఇంటిని సందర్శించి 20 మంది చిన్నారులను గుర్తించి వారి పేర్లను నమోదు చేసుకున్నారు. అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటలతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె : విద్యార్థులు, యువతకు ఆటలతోనే మానసిక ప్రశాంతత, దేహధారుఢ్యం చేకూరుతుందని మదనపల్లె హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీఐ ఎదురుగా మైదానంలో మినీవాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు మెమొంటో, మెడల్స్ అందజేశారు. యువత క్రీడానైపుణ్యం కోసం సమ్మర్‌క్యాంపు నిర్వహిస్తున్న కోచ్ యూసఫ్‌ను అభినందించారు. సీనియర్ క్రీడాకారులు హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు శివ,కిరణ్, పురుషోత్తం రెడ్డి, సిరాజ్, బషీర్, దివాకర్‌లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండి పెట్టాలని ఎంఈఓ నారాయణ, ఎంఈఓ–టూ గౌస్ పీర్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని 70 పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులతో అధికారులు బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో సమీక్షించారు. భోజన నిర్వాహకులు పరిశుభ్రత పాటిస్తూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండాలని ఆదేశించారు. అనంతరం పరిశుభ్రత, మెనూ వివరాలను డిస్‌ప్లే ద్వారా అవగాహన కల్పించారు.

కౌంటింగ్ రోజున ప్రశాంతంగా ఉండాలి

కేవీపల్లె : జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కలకడ సీఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం, తిమ్మాపురం వడ్డిపల్లె, నూతనకాల్వ తదితర గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి, శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చే రోజున కొత్త వ్యక్తులు ఎవరూ గ్రామాలకు రాకూడదని, శాంతిభద్రతలకు అవాంతరం కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు ఎన్నికల నియమాలకు లోబడి నడుచుకోవాలని ఆదేశించారు.

టీబీ నిర్మూలన లక్ష్యంగా బీసీజీ టీకా

పీలేరు రూరల్ : టీబీ (క్షయ) వ్యాధి నిర్మూలన లక్ష్యంగా బీసీజీ టీకా ఇస్తున్నట్లు డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక మోడల్ కాలనీలో బీసీజీ టీకా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీజీ టీకాకు సమ్మతి తెలిపినవారికి యాక్షన్ ప్లాన్ ప్రకారం టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీబీ రాకుండా ముందస్తుగా బీసీజీ ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు టీకాకోసం ఆరోగ్య కార్యకర్తల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. టీబీపీ సూపర్‌వైజర్ మోహన్, ఎస్టీఎల్ఎస్ మునీశ్వరయ్య, ఆరోగ్య కార్యకకర్త లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పోలప్ప

ములకలచెరువు : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. మురుగునీటి కాలువల శుభ్రత, వీధి లైట్ల ఏర్పాట్లలో ఫిర్యాదులు అందకుండా చూసుకోవాలన్నారు. ఆర్బీకేలో వేరుశనగ విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకొన్న రైతులు సెంటర్లలో కాయలు తీసుకోవాలని సూచించారు.

వేరుశనగ విత్తనాల నాణ్యతలో రాజీలేదు

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్


కేవీపల్లె: రాయితీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్న డీఏఓ చంద్రానాయక్


నిమ్మనపల్లె : రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ఏడీఏ దీక్షాకుమారి

పీలేరు : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రాయితీ వేరుశెనగ విత్తనాల నాణ్యతలో తేడా వస్తే రాజీపడేది లేదని, తిరిగి పంపవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ముడుపులవేముల రైతు భరోసా కేంద్రంలో వేరుశెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీతో విత్తనాలు పొందిన రైతులు విధిగా పంట నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఏడీఏ వై.వి. రమణరావు, ఏవోలు రమాదేవి, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలతో విధిగా సాగు చేయాలి

కేవీపల్లె : ప్రభుత్వ రాయితీతో పొందిన వేరుశనగ విత్తనకాయలతో విధిగా సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గ్యారంపల్లె రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన డీఏవో రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ విత్తన కాయలు తీసుకొన్న రైతులు పంటసాగుకు మాత్రమే ఉపయోగించాలన్నారు. దుర్వినియోగం చేస్తే విత్తనం ధర తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. అంతేగాక అనంతరం ప్రభుత్వ రాయితీలు ఏవీ వర్తించవని హెచ్చరించారు. విత్తనకాయలు నాణ్యత బాగాలేకుంటే తక్షణం వెనుకకు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడీఏ వై.వి. రమణరావు, ఏవోలు శ్రావణి, రమేష్‌రాజు, ఏఈవోలు ఇంద్రసేనారెడ్డి, అనితాదేవి పాల్గొన్నారు.

రైతులు కోరిన విత్తనాలు అందించాలి

కలకడ : జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా రైతులు సాగు చేస్తున్న వేరుశనగ విత్తనాల వివరాలను సేకరించి వారు కోరుకునే నాణ్యమైన విత్తనాలను అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ,చంద్రనాయక్ అన్నారు. బుధవారం కలకడ మండలంలోని ఎర్రకోటపల్లె రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనకాయలను అందజేశారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం : రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ వాణిశ్రీ అన్నారు. బుధవారం పట్టణంలో ఆర్‌బీకే 1లో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు వేరుశనగ విత్తనాలు కొరత లేకుండా రైతుల అవసరం మేరకు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. సాగుకు అనువుగా ఉండే వేరుశనగ విత్తన కాయల పంపిణీలో కె6, నారాయణి రకం రకాలను పంపిణీ చేసిందన్నారు. ప్రభుత్వం రైతులకు వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలానికి కె6 రకం 430 క్వింటాళ్లు, నారాయణి 1200 క్వింటాళ్లు, టిసిజిఎస్ 100 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏవో హేమలత, ఆర్‌బికే సిబ్బంది కదిరమ్మ, నాగరాజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనకాయలు సద్వినియోగం చేసుకోవాలి

నిమ్మనపల్లె : ఖరీఫ్–2024 సీజన్‌కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందజేస్తున్న వేరుశనగ విత్తనకాయలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె వ్యవసాయశాఖ ఏడీఏ దీక్షాకుమారి అన్నారు. బుధవారం నిమ్మనపల్లె మండలంలోని రెడ్డివారిపల్లె, తవళం, రాచవేటివారిపల్లె ఆర్‌బీకే కేంద్రాల్లో జరుగుతున్న వేరుశెనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఓ మురళీమోహన్, ఏఈఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనకాయల పంపిణీ

గుర్రంకొండ: మండలంలోని 13 ఆర్బీకేల పరిధిలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం అన్ని ఆర్బీకేల పరిధిలో 250 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయల్ని పంపిణీ చేశామన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొన్న రైతులకు మాత్రమే విత్తన కాయలు పంపిణీ చేశామన్నారు. నారాయణి రకం బస్తా రూ. 1750, కె6 రకాల విత్తనకాలు 30 కేజీల విత్తనకాయల బస్తా రూ. 1720లకు రైతులకు సబ్సిడీపై అందించారు.